ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 4 జనవరి 2024


విజయనగరం: చెల్లూరు వద్ద స్థానికులకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి

అండగా మేమున్నాం

● ఆపన్నులకు నారా భువనేశ్వరి భరోసా ● కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆర్థిక సాయం


కోరాడ అప్పారావు భార్యకు సాయం అందిస్తున్న భువనేశ్వరి


గులిపల్లి అప్పారావు భార్యతో మాట్లాడుతున్న భువనేశ్వరి


పోలయ్య కుటుంబ సభ్యులకు సాయం పంపిణీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, జనవరి 3: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆపన్నులకు భరోసా ఇచ్చారు. ఏ సమయం లోనూ అధైర్యపడొద్దని, టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన జిల్లా వాసుల కుటుంబాలను పరామర్శించేందుకు బుధవారం విజయనగరం వచ్చారు. నగరంలోని కోరాడ అప్పారావు కుటుంబాన్ని తొలుత పరామర్శించారు. చంద్రబాబుకు రెండు దశల్లో బెయిల్ నిరాకరణ వార్తను టీవీలో చూస్తూ అప్పారావు తీవ్ర భావోద్వేగానికి గురై గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఈయన కుటుంబ సభ్యులను భువనేశ్వరి ఓదార్చారు. బాధపడొద్దని, అండగా ఉంటామని చెప్పారు.

● విజయనగరంలోని తహసీల్దారు కార్యాలయం రోడ్డులో ఉన్న అప్పారావు నివాసానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నారు. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్లు సునీలా గజపతిరాజు, ప్రసాదుల కనకమహాలక్ష్మీ, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నగర, మండల నాయకులు భారీ ఎత్తున చేరుకున్నారు. అప్పారావు సతీమణి కోరాడ పద్మావతిదేవి, కుమారుడు జయంత్‌తో భువనేశ్వరి 20 నిమిషాల పాటు మాట్లాడారు. అప్పారావు మరణించిన తీరు, పార్టీకి అందించిన సేవలను కుటుంబ సభ్యులు ఆమెకు వివరించారు. అనంతరం రూ.3 లక్షల చెక్కును పద్మావతి దేవికి అందించారు. జయంత్ బీటెక్ పూర్తయిన నేపథ్యంలో ఉన్నత చదువు, ఉపాధి గురించి మాట్లాడారు. అధైర్యపడొద్దని. పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి ఆమె తెర్లాం బయలుదేరారు. జిల్లా పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరికి చెల్లూరు వద్ద పార్టీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఘన స్వాగతం పలికారు.


భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన మహిళలు


భువనేశ్వరిని పలకరించేందుకు వచ్చిన పెరుమాళి గ్రామస్థులు

పెరుమాళి వద్ద ఘన స్వాగతం..

తెర్లాం: పెరుమాళి, మోదుగవలస గ్రామాల వద్ద నారా భువనేశ్వరికి ఘన స్వాగతం లభించింది. ప్రజలు, అభిమానులు, నాయకులు అధికంగా తరలివచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక పెరుమాళి గ్రామానికి చెందిన మైలపల్లి పోలయ్య, మోదుగవలసకు చెందిన గులిపల్లి అప్పారావు హఠాన్మరణం చెందారు. ఆ కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన భువనేశ్వరికి పెరుమాళిలో ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం పోలయ్య కుటుంబంతో ఆమె మాట్లాడారు. అందరూ ధైర్యంగా ఉండాలని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.3 లక్షల చెక్కును పోలయ్య భార్య భారతి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మోదుగవలస గ్రామంలో గులిపల్లి అప్పారావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఆ గ్రామ ప్రజలు కూడా ఘన స్వాగతం పలికారు. బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆమె భగవంతుని కోరుకున్నారు. ఎవరూ అధైర్య పడవద్దన్నారు. అనంతరం గులిపల్లి అప్పారావు భార్య పైడాలమ్మకు సాయం అందజేశారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం గుండా రాజాం పయనమయ్యారు. ఆమె వెంట టీడీపీ బొబ్బిలి ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు కళావెంకటరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున తదితరులు ఉన్నారు.

పుట్టబోయే బిడ్డపైనా అప్పు

● మహిళా నాయకులతో అశోక్‌గజపతిరాజు మాటామంతీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పుట్టబోయే బిడ్డలపైనా అప్పు ఉందని, మహిళా నేతలు ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులతోనే కాకుండా ఇతర మహిళలకు అర్థమయ్యేలా చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. నారా భువనేశ్వరి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాల యానికి విచ్చేసిన టీడీపీ మహిళా నాయకులు గుమ్మిడి సంధ్యారాణి, కోళ్ల లలితకుమారితో ఆయన బుధవారం కొద్దిసేపు మాట్లాడారు. జగన్ ప్రభుత్వ పాలన వల్ల ఆర్థికంగా ఎంత నష్టపోతున్నామో ప్రజలకు వివరించాలని కోరారు.

రాజాంలో నీరాజనం..

రాజాం/ రూరల్: రాజాం చేరుకున్న నారా భువనేశ్వరికి జనం నీరాజనం పట్టారు. తెర్లాం మండలం పెరుమాళి పర్యటన ముగించుకుని సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో మండలంలోని ఒమ్మి జంక్షన్‌కు చేరుకున్న ఆమెకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వంగా వెంకటరావు ఆధ్వర్యంలో వందలాది మంది స్వాగతం పలికారు. బొబ్బిలి జంక్షన్ వద్ద మాజీ మంత్రి, టీడీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. కారు దిగిన ఆమెపై పార్టీ అభిమానులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో పాలకొండ రోడ్‌లోని జీఎంఆర్ఐటీ ప్రాంగణంలోని అతిథి గృహానికి భువనేశ్వరి చేరుకున్నారు.

బొబ్బిలి జంక్షన్‌లో భువనేశ్వరి కాన్వాయ్‌పై పూల వర్షం


చుక్కలు చూపిస్తున్న మిల్లర్లు


రాజాం: బొబ్బిలి రోడ్డులో ధాన్యం లోడుతో ట్రాక్టర్

● క్వింటా వద్ద 7 కిలోలు ఇస్తేనే కొనుగోలు
● లేకుంటే కొర్రీలతో తిప్పిపంపుతున్న వైనం
● రాజాం మిల్లు వద్ద రైతుల ఆందోళన
● పట్టించుకోని అధికారులు

రాజాం, జనవరి 3: రాజాంలోని బొబ్బిలిరోడ్డులో బుధవారం ఉదయం ఓ రైస్‌మిల్లు వద్ద పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు ధాన్యం లోడుతో నిలిచి పోయాయి. ఎంతకీ లైన్ తరగడం లేదు. విసిగిపోయిన రైతులు మిల్లర్లను ప్రశ్నించారు. క్వింటా ధాన్యం దగ్గర 7 కిలోల వరకూ తరుగు తీయడానికి అంగీకరిస్తేనే లోడు దించడం సరికాదని నిలదీశారు. చాలా సేపు అక్కడ ఆందోళన చేశారు. అధికారులు మాత్రం సవ్యంగా కొనుగోలు జరుగుతు న్నట్లు చూపుతున్నారని రైతులు వాపోయారు. ఇది ఒక్క రాజాంలోనే కాదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉంది. ధాన్యం కొను గోలులో రైతు దగా పడుతున్నాడు. రైతుభరోసా కేంద్రాలను కొనుగోలు కేంద్రాలుగా చేసి ధాన్యం సేకరిస్తున్నా ఎనలేని జాప్యం జరుగుతూ వస్తోంది. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. దీంతో ధాన్యం సేకరణ అంతంతమాత్రంగా జరుగుతోంది. జీపీఎస్ విధానం, కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలతో రైతులు విసిగివేసారిపోతున్నారు. ఈక్రాప్ నమోదు కాని రైతులు, కౌలు రైతుల ధాన్యం సైతం తీసుకోవడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు పంట విక్రయించాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 కిలోల బస్తాకు మద్దతు ధరగా రూ.2,183ను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ధాన్యం రంగుమారిందని, తేమశాతం అధికంగా ఉందని కారణం చూపి క్వింటా వద్ద ఏడు కిలోలు తరుగుగా తీస్తుండడంతో సుమారు రూ.120ల వరకూ రైతు నష్టపోతున్నాడు. మరోవైపు ఈ-పంట నమోదు జరగని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. కౌలురైతులు పండించిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలంటే సంబంధిత భూ యజమానులతో ఈ-క్రాప్ నమోదు చేయాలని మెలిక పెట్టారు. దీంతో చేసేదేమి లేక.. ఇన్ని ఇబ్బందులు పడలేక రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రూ.1900కే క్వింటా ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఇలా బస్తాకు మద్దతు ధరలో రూ.250 నుంచి రూ.300 వరకూ నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరిగితే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు చెబుతున్నారు.

అదనపు అద్దె భారం

నేను మిల్లుకు ధాన్యం తెచ్చి రెండు రోజులవుతోంది. ఇంతవరకూ పంట తీసుకోలేదు. ధాన్యం అన్‌లోడ్ కాకపోవడంతో లారీలు, ట్రాక్టర్లకు కిరాయి ఇచ్చుకోవాల్సి వస్తోంది. తరుగు రూపంలో క్వింటా ధాన్యం వద్ద రూ.250 వరకూ కోల్పోతుండగా.. వాహనాల అద్దె రూపంలో మరింత భారం పెరుగుతోంది.

- పోలారావు, రైతు, రాజాం

బ్యాంకు గ్యారెంటీల్లో జాప్యం

బ్యాంకు గ్యారెంటీలను మిల్లర్లు వ్యూహాత్మకంగానే ఇవ్వడం లేదు. చివరి వరకూ జాప్యం చేసి రైతుల సహనంతో ఆడుకుంటున్నారు. ఒక మిల్లరు కోటి రూపాయలకు బ్యాంకు గ్యారెంటీ ఇస్తే..అంతే విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ట్రక్ షీట్లు ఇచ్చారు. రూ.కోటి గ్యారెంటీ ఇస్తే రూ.3 కోట్లు ధాన్యం ఇవ్వాలని మిల్లర్లు కోరారు. దీనిపై అధికారుల నుంచి స్పందన లేదు. దీంతో మిల్లర్లు రైతులకు నరకం చూపిస్తున్నారు. కొనుగోలుకు షాకులు వెతుకుతున్నారు. వారం రోజులుగా రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎముకల కొరికే చలిలో ధాన్యం లోడులతో రాత్రీ పగలూ కాపలా ఉండాల్సి వస్తోంది.


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎస్‌ఐల బదిలీలు

● ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం

విజయనగరం క్రైమ్, జనవరి 3: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐలను భారీగా బదిలీ చేస్తూ ఎస్పీ దీపిక బుధవారం ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలోనే వీరి బదిలీల ప్రక్రియ సాగింది. బదిలీ అయిన ఎస్‌ఐలు వెంటనే విధుల్లో చేరాలని ఎస్పీ పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎస్.భాస్కరరావు	విజయనగరం వన్‌టౌన్	గుర్ల
డి.రామగణేష్	విజయనగరం వన్‌టౌన్	నెల్లిమర్ల
ఆర్.గోపాలరావు	విజయనగరం వన్‌టౌన్	ఎల్.కోట
బి.గణేష్	విజయనగరం రూరల్	ఆండ్ర
కె.కిరణ్‌కుమార్‌నాయుడు	గంట్యాడ	చీపురుపల్లి
ఎస్. కృష్ణమూర్తి	భోగాపురం	డెంకాడ
యు.మహేష్	డెంకాడ	గజపతినగరం
పి.నారాయణరావు	నెల్లిమర్ల	దిశ విజయనగరం
జి.లోవరాజు	ఎస్.కోట	బొబ్బిలి
వైపీ జనార్ధన్	కొత్తవలస	వంగర
బి.జ్ఞాన ప్రసాద్	బొబ్బిలి	రామభద్రపురం
బి.భాగ్యం	బొబ్బిలి	సీసీఎస్ విజయనగరం
బి.సురేంద్రనాయుడు	రామభద్రపురం	గంట్యాడ
సీహెచ్ గంగరాజు	గజపతినగరం	ఎస్.కోట
ఎస్.రవి	బొండపల్లి	సీసీఎస్ ఎలెక్షన్ సెల్
పి.సిద్ధార్థకుమార్	ఆండ్ర	డీసీఆర్‌బీ విజయనగరం
ఎ.సన్యాశినాయుడు	చీపురుపల్లి	వీఆర్ విజయనగరం
ఎస్.హరిబాబునాయుడు	గుర్ల	విజయనగరం వన్‌టౌన్
పి లీలావతి	రాజాం	దిశ విజయనగరం
వీవీ రామకృష్ణారావు	రాజాం	బొబ్బిలి ట్రాఫిక్ స్టేషన్
పి.శ్యామలాదేవి	దిశ విజయనగరం	విజయనగరం రూరల్
నసీమా బేగమ్	విజయనగరం రూరల్	సీసీఎస్ విజయనగరం
కె.లక్ష్మణరావు	దిశ విజయనగరం	బొండపల్లి
ఆర్.వాసుదేవ్	డీసీఆర్‌బీ విజెడ్ఎం	విజయనగరం రూరల్
ఎమ్.ప్రశాంత్‌కుమార్	సీసీఎస్ విజెడ్ఎం	డీసీసీ విజయనగరం
జి.పోలినాయుడు	బొబ్బిలి ట్రాఫిక్	రాజాం

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

అధికారులు, పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 3: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)పై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రగతిని వివరించారు. దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, ఈనెల 22న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. డిసెంబరు 23 నుంచి ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించామని, జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గాల్లో నమూనా ఈవీఎంలను ఏర్పాటు చేసి ఓటు వేసే విధానాన్ని అందరికీ వివరిస్తున్నామని తెలిపారు. అలాగే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నమూనా ఈవీఎంలతో ప్రత్యేక వాహనాల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం 1154 పోలింగ్ స్టేషన్లకు గాను ఇప్పటివరకూ 670 కేంద్రాల్లో అవగాహన శిబిరాలు పూర్తయ్యాయని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో అనిత, ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గర్జించిన అంగన్వాడీలు


కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

అంగన్వాడీ కార్యకర్తల సమ్మె తారస్థాయికి చేరింది. కలెక్టరేట్ ముట్టడితో జిల్లా కేంద్రాన్ని బుధవారం అట్టుడికించారు. వేలాదిగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్‌కు చేరుకోగానే రోడ్డుపై బైఠాయించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలియజేస్తున్న సమయంలో సీడీపీవో జి.ప్రసన్న కలెక్టరేట్‌కు వచ్చారు. అంగన్వాడీలు ఆమెను చుట్టుముట్టారు. అరగంటపాటు నిర్బంధించారు. 'మీ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతామని' ఆమె వారికి చెప్పారు. దీంతో శాంతించిన కార్యకర్తలు ఆమెను విడిచిపెట్టారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని చివరి వరకు నినాదాలు చేశారు.

యూటీఎఫ్ నాయకుల ధర్నా

కలెక్టరేట్: ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న రూ.18,036 కోట్లను వెంటనే విడుదల చేయాలంటూ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు ధర్నా చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని, 30 శాతం ఐఆర్‌తో 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, పెరిగిన జీతాలు అందజేయాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాము, ఈశ్వరరావు, రమేష్‌చంద్ర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన..

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన బుధవారం కూడా కొనసాగింది. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను అందజేయాలని, ప్రతి నెలా ఒకటిన జీతాలు ఇవ్వాలని, పార్ట్ టైం విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని నినాదాలు చేశారు. వారికి యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.


కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ఆందోళన



రాజాం: హారతులు పట్టుకొని నిరీక్షిస్తున్న మహిళలు



బాడంగి: భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు వచ్చిన నాయకులు

భువనేశ్వరికి ఘన స్వాగతం

● వాడవాడలా బారులు తీరిన అభిమానులు ● ప్రత్యేకంగా కలిసిన జిల్లా నాయకులు



స్వాగతం పలుకుతున్న మీసాల గీత, కేఏ నాయుడు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు అనంతరం మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నిర్వహించిన 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాకు వచ్చిన నారా భువనేశ్వరికి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆమె రాకకోసం ఎదురు చూసిన వారంతా నినాదాలతో హోరెత్తించారు. మహిళలు హారతులిచ్చారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పుష్పగుచ్ఛం ఇస్తున్న సువ్వాడ వనజాక్షి, రాజశేఖర్



మాట్లాడుతున్న కోండ్రు



స్వాగతం పలుకుతున్న సంధ్యారాణి, జగదీశ్వరి..



లలితకుమారి తదితరులు

సంక్షేమ పథకాలన్నీ కేంద్రానివే

లక్కవరపుకోట: రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్లమాని శేషావతారం తెలిపారు. బుధవారం శ్రీరాంపురంలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర పథకాలకు రంగులేసి జగన్ ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, ఉపాధిహామీ, ఉచిత రేషన్ వంటి పథకాలను వివరించారు.

పేదలకు అండగా ఉండడమే ధ్యేయం

వేపాడ: పాదయాత్రలో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు అన్నారు. వేపాడ గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ధ్రువపత్రాల పంపిణీ

విజయనగరం రూరల్: నగర శివార్లలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో బుధవారం వైస్ ఛాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ 43 మంది విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం సర్టిఫికెట్లు అందజేశారు. బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ జీజే నాగరాజు ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు వెళ్లి సాంకేతికత, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

పింఛన్ మూడు వేలకు పెంపు

కలెక్టరేట్: ఈనెల నుంచి లబ్ధిదారులకు పింఛన్‌ను మూడు వేల రూపాయలకు పెంచినట్లు జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ కాకినాడలో పాల్గొన్నారు. లైవ్‌లో జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంఎల్‌సీ రఘురాజు పాల్గొని సీఎం కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 2,85,675 మంది లబ్ధిదారులకు రూ. 83.54 కోట్లు అందిస్తున్నామని జడ్పీ చైర్మన్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

రాజాం రూరల్: మండల పరిధిలోని కంచరాం సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని రాజాం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 41600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

నూతన కార్యవర్గం

రాజాం: స్థానిక బెరాకా బాపిస్టు చర్చిలో బుధవారం రాజాం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వి.ప్రభు కుమార్, అధ్యక్షులుగా కె .కుమార్‌రాజు, ఉపాధ్యక్షులుగా బి.విక్టర్‌పాల్, కార్యదర్శిగా కె.పాల్. సహాయ కార్యదర్శిగా పి.ఫెలిక్స్, కోశాధికారిగా ఆర్.ఎం.సామ్యూల్, సీనియర్ అడ్వయిజర్‌గా వై.మత్తయ్య, టి.కృపానందం, వి.డానియల్ తదితరులు ఎన్నికయ్యారు.

ఆరుతడి పంటలకే నీరు వాడాలి

వంగర: మడ్డువలస కాలువ నీరు ఆరు తడి పంటలకు వాడుకోవాలని డీఈఈ పి.అర్జున్ తెలిపారు. మడ్డువలస కుడి కాలువ ద్వారా బుధవారం రబీకి నీరు విడుదల చేసి మాట్లాడారు. ముందుగా కాలువ గేట్లకు ప్రత్యేక పూజలు చేసి నీరు విడుదల చేశారు. కాలువలో నీరు వస్తోందనే ఉద్దేశంతో ఎవరైనా వరి, ఇతర పంటలు వేస్తే నష్టపోతారన్నారు. నాలుగు మండలాల్లో కేవలం 13,500 ఎకరాలకు మాత్రమే రబీలో నీరు అందించగలుగుతామన్నారు. ఏఈఈలు అవినాష్, సూర్య, నితిన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యం లాభదాయకం

శృంగవరపుకోట రూరల్: బిందు, తుంపర సేద్యం రైతులకు ఎంతో లాభదాయకమని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కొత్తూరు, శివరామ రాజుపేట, గోపాలపల్లి గ్రామాల్లో బిందు, తుంపర సేద్యాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయం



మాట్లాడుతున్న సుజయ్ కృష్ణ

రామభద్రపురం, జనవరి 3: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగిస్తుందని మాజీ మంత్రి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. బూసాయవలసలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ముఖ్యంగా యువత ఉపాధి లేక అల్లాడిపోతోందని, కొత్త పరిశ్రమలు తెప్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. చిరుద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంగన్‌వాడీలు, చిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటారని అన్నారు. జియ్యమ్మవలస మాజీ ఎంపీపీ దత్తి లక్ష్మణరావు, జనసేన నాయకుడు గిరడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

కొత్తవలస: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశానికి హాజరైన స్థానిక శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు కొంత నిర్వేదంతో ఉపన్యాసాన్ని మొదలుపెట్టారు. వచ్చే సమావేశం నాటికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం టిక్కెట్ తనకు వస్తుందో.. రాదో... వస్తే తాను గెలుస్తానో లేదో..మళ్లీ సమావేశంలో పాల్గొంటానో లేదో అనే విధంగా ఉపన్యాసాన్ని కొనసాగించారు. ఎమ్మెల్సీ రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు సమావేశానికి హాజరు కాకపోవడం అనుమానాలు కలిగించింది. కొన్ని ముఖ్యమైన శాఖలపై సమీక్ష నిర్వహించి.. సమావేశం జరిగిందనిపించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛను రూ.3 వేలకు పెంచిన సందర్భంగా కొత్తగా మంజూరైన వారికి అందజేయడానికి ఎమ్మెల్యే త్వరగా సమావేశాన్ని ముగించి వారందరినీ కింద ఏర్పాటు చేసిన సమావేశానికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, ఎంపీడీవో వై.పద్మజ, తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా హాజరయ్యారు.

ప్రాథమికోన్నత పాఠశాల తనిఖీ

రాజాం: గడిముడిదాం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓలు పి.ప్రవీణ్ కుమార్, వి.దుర్గారావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి... రుచిగా వండాలని ఆదేశించారు. హెచ్‌ఎం అప్పలస్వామి, ఎండీఎం నిర్వాహకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థను రక్షించుకుందాం



కదలిరండి వాహనాలను ప్రారంభిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జనవరి 3: సర్పంచ్‌ల హక్కులు, విధులు, సమస్యల గురించి చర్చించే క్రమంలో ఏపీ పంచాయతీ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో 'కదిలిరండి.. పంచాయతీ వ్యవస్థను రక్షించుకుందాం' అనే కార్యక్రమం కోసం బుధవారం ఉదయం ఏడు గంటలకు విజయనగరం మండల పరిధిలోని సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గొల్లలపేట మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఈగల సత్యారావు మాట్లాడుతూ, హక్కుల కోసం జరిగే పోరాటాన్ని ప్రభుత్వం బలవంతంగా అడ్డుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోరాటానికి మాజీ సీఎం చంద్రబాబు మద్దతు ప్రకటించారన్నారు. సర్పంచ్‌ల నిధులను అనధికారికంగా మళ్లించారన్నారు. ఈ కార్యక్రమం కోసం విజయనగరం నుంచి విజయవాడకు బయలుదేరిన వాహనాలకు విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌వర్మతో పాటు పలువురు టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల హక్కులను కాపాడాలి

లక్కవరపుకోట, జనవరి 3: రాష్ట్రంలో స్థానిక సంస్థల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ జెడ్పీటీసీ, టీడీపీ నేత కరెడ్ల ఈశ్వరరావు తెలిపారు. బుధవారం గుంటూరులో పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లక్కవరపుకోట మండలం నుంచి తామరాపల్లి, తలారి, మార్లాపల్లి, లింగంపేట గ్రామ సర్పంచ్‌లతో పాటు ఆయన సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల నిర్వీర్యంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మండి పడినట్లు తెలిపారు. రాష్ట్రంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు కనీస విలువ లేకుండా పోయిందని ఈశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి వేలాది మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. మండలం నుంచి యడ్ల పైడిరాజు, జి.సత్యం, ఎం.భాస్కరరావు, జి.ప్రసాద్ తదితరులు హాజరయ్యారని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్.కోట మండల టీడీపీ సర్పంచ్‌లు

ఉన్నోళ్లకే వైఎస్ఆర్ కాలనీలో ఇళ్లు

● స్థలాలు మంజూరు చేయకపోవడంతో గెడ్డల్లో పాకలు

● అధికారులతో ఆక్రమణదారుల వాగ్వాదం

శృంగవరపుకోట, జనవరి 3: స్థానిక పందిరప్పన్న కూడలి సమీపంలో చెరకు కాటా భూమికి ఆనుకొని ఉన్న గెడ్డ పొడవునా ఆక్రమించి... కొందరు పాకలను నిర్మించారు. వీటి వద్ద అంబేడ్కర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చెరకు కాటాకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారని రైతులు భీమసింగి చక్కెర కర్మాగారం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ యాజమాన్యం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తహసీల్దార్ డి.శ్రీనివాసరావు వీఆర్వోలు కన్నయ్య, నాయుడులను బుధవారం క్షేత్ర స్థాయికి జేసీబీతో పంపించారు. ఇద్దరు కానిస్టేబుళ్లు భద్రత కల్పించేందుకు వచ్చారు. పాకలను తొలగించేందుకు ఉపక్రమించడంతో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. తొలగిస్తే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని హెచ్చరించారు. చెరకు కాటా స్థలం కాదని... గెడ్డ స్థలంలో పాకలు నిర్మించామని వాదనకు దిగారు. ఇంతలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎస్.ఐ లోవరాజులు ఆక్రమణదారులతో చర్చించారు. సర్వే చేసిన తరువాత చెరకు కాటాకు చెందిన స్థలమైతే వదిలేస్తామని అధికారులకు వివరించారు. గెడ్డ స్థలాన్ని ఆక్రమించడం చట్ట ప్రకారం నేరం కాబట్టి ఖాళీ చేయాలని తహసీల్దార్ సూచించారు. ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా దఫాలు దరఖాస్తులు ఇచ్చినా.. స్థలాలు ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో గెడ్డలో పాకలు వేశామని వారు బదులిచ్చారు. రేషన్ కార్డులు లేని వారికి స్థలాలు ఇవ్వలేకపోయామని రెవెన్యూ అధికారులు చెప్పగా... అందుకే గెడ్డ స్థలంలో నివశించేందుకు సిద్ధపడుతున్నామని చెప్పుకొచ్చారు. పేదల పాకలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని... ఇదే గెడ్డలో నిర్మించిన భవనాల పరిస్థితేంటని నిలదీశారు. డబ్బున్నోళ్లకు ఓ న్యాయం... పేదలకు మరో న్యాయమా అంటూ ఘర్షణకు దిగారు. ప్రభుత్వ భూమి వద్ద అంబేద్కర్ ఫ్లెక్సీలను పెట్టడం నేరమని.. వాటిని తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. మహిళలపై చేయి వేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులతో గొడవకు దిగారు. ఎస్.ఐ లోవరాజును చూపిస్తూ ఆయన వద్దనే కేసులు పెడతామని బెదిరించారు. దీంతో అంబేడ్కర్ ఫ్లెక్సీని కూడా అధికారులు తొలగించలేకపోయారు. చివరికి చేసేదేమీ లేక శుక్రవారం కార్యాలయానికి రావాలని వారితో చెప్పి తహసీల్దారు తిరుగుముఖం పట్టారు.



ఎస్.కోట: గెడ్డ ఆక్రమణల వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించకుండా అడ్డుకుంటున్న దృశ్యం

ప్రభుత్వ తీరు మారాలి

● కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన

రాజాం రూరల్, జనవరి 3: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు హెచ్చరించారు. బుధవారం రాత్రి ఇక్కడి మెయిన్‌రోడ్‌లో కార్మికులు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

బొబ్బిలి: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు బుధవారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి తమ నిరసన తెలిపారు. సమానపనికి సమాన వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం ససేమిరా అనడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు నాయకత్వంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ● ఈ నెల 4 నుంచి మున్సిపాలిటీలో వాటర్, లైటింగ్, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్స్ కూడా సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటారని శంకరరావు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజరు శివ ప్రసాద్‌కు బుధవారం మెమోరాండం అందజేశారు. మజ్జి ఈశ్వరరావు, ప్రసాద్, మోహన్ తదితరులు ఉన్నారు.





రాజాంలో ర్యాలీ, బొబ్బిలిలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జామి జనవరి 3: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కుమరాం ప్రభుత్వ పాఠశాల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుభూక్త లక్ష్మి(40) తన అల్లుడు, కూతురిని సంక్రాతి పండగకు పిలిచేందుకు కుమారుడు సాయికుమార్‌తో బైక్‌పై మంగళవారం రాత్రి విజయనగరం వెళ్లింది. రాత్రి కుమార్తె ఇంటి వద్దనే ఉండి, పండగకు పిలుపుచేసి బుధవారం ఉదయం 8గంటలకు స్వగ్రామమైన అన్నంరాజుపేటకు రెండేళ్ల మనవడిని పట్టుకుని కుమారుడితో కలిసి బైక్‌పై బయలుదేరింది. అయితే కుమరాం పాఠశాల వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఏడో తరగతి విద్యార్థి సైకిల్‌పై వస్తూ అడ్డు పడడంతో వాహనం నడుపుతున్న సాయికుమార్ కంగారుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చున్న లక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోయింది. సాయికుమార్, రెండేళ్ల బాలుడికి స్వల్పగాయాలయ్యాయి. పాఠశాల విద్యార్థికి స్వల్ప గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదం నిండుకుంది. మృతురాలి భర్త అప్పలసూరి తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎస్‌ఐ వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో ఈవోపీఆర్‌డీ దుర్మరణం

జియ్యమ్మవలస/ఆమదాలవలస: జియ్యమ్మవలస ఈవోపీఆర్‌డీ ఎన్.మురళీరావు శ్రీకాకుళం జిల్లాలోని ఊసవానిపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. పలాస రైల్వే ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన నానుపాత్రుని మురళీరావు(54) మంగళవారం రాత్రి ఊసవానిపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని రైలుఢీకొని మృతిచెందాడు. మురళీరావు వాకింగ్ చేస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మురళీరావుకు భార్య కుమారితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా మురళీరావు మృతిపై ఎంపీపీ బొంగు సురేష్, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలియజేశారు.

బెల్ట్ షాపులపై దాడి.. ఇద్దరిపై కేసు

వేపాడ: మండలంలోని కరకవలస, దబ్బిరాజుపేట గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ బుధవారం తెలిపారు. కరకవలసలో 13, దబ్బిరాజుపేటలో 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

రెండెకరాల ధాన్యం కుప్ప దగ్ధం

రేగిడి: ఉణుకూరు గ్రామంలో మంగళవారం రాత్రి తెంటు కృష్ణమూర్తి అనే రైతుకు సంబంధించిన రెండెకరాల ధాన్యం కుప్ప దగ్ధమైంది. రూ.1.37 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు ఆర్ఐ రేవతి తెలిపారు. పక్కనే మరికొన్ని కుప్పలు ఉన్నా.. గ్రామస్థులు అప్రమత్తం కావడంతో పెద్దప్రమాదం తప్పింది. ధాన్యం మొత్తం బుగ్గిపాలవటంతో రైతు లబోదిబోమంటున్నాడు. ఆర్ఐ రేవతి, వీఆర్‌ఓ సత్యనారాయణలు నష్టాన్ని అంచనా వేశారు.

పూరిల్లు ..

రేగిడి: అంబఖండి గ్రామానికి చెందిన కుప్పలి సూర్యుడమ్మకు చెందిన పూరిల్లు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా. రాత్రి అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకొంది. మంటలను గుర్తించిన బాధితురాలు బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీపం ఒత్తిని ఎలుకలు ఇంటి పైకప్పు పైకి తీసుకువెళ్లడంతో ప్రమాదం సంభవించినట్టు బాధితురాలు చెబుతోంది. తిండిగింజలు, వంట పాత్రలు, రూ.30 వేల నగదు మంటల్లో ఆహుతైనట్టు ఆర్ఐ రేవతి వెల్లడించారు. తహసీల్దార్ సుదర్శనరావు ప్రమాద స్థలాన్ని సందర్శించి.. ప్రాథమి సాయాన్ని పంపిణీ చేశారు.

వివాహిత మృతి కేసులో లొంగిపోయిన భర్త

బాడంగి: తన భార్య వంగపండు అన్నపూర్ణను తానే బావిలో తోసేసినట్టు నిందితుడు రామారావు ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు బుధవారం స్థానిక స్టేషన్‌లో డీఎస్పీ శ్రీధర్ కేసు వివరాలను వెల్లడించారు. కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు రామారావు మొదటి భార్యకు పిల్లలు లేరు. దీంతో అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణను రామారావు రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు మూడేళ్ల కుమార్తె మౌనిక పుట్టిన తరువాత మరొక సంతానం కలిగి చనిపోయింది. తాజాగా అన్నపూర్ణ మూడో నెల గర్భిణి. అయితే తాను అబార్షన్ చేయించుకుంటానని రామారావుతో తరచూ గొడవపడేది. ఆ పనిచేయవద్దని రామారావు వారించేవాడు. ఈ విషయంపై పలుమార్లు వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో రామారావు విసిగిపోయాడు. చివరకు కొత్తచెరువు పొలం వద్దకు అన్నపూర్ణను తీసుకువెళ్లి అక్కడ బావిలో తోసేశాడు. నిందితుడిపై 302, 489 ఏ కేసులు నమోదు చేశామని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు, ఏఎస్‌ఐ కొండలరావు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రేగిడి: సంకిలి గ్రామంలో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. సంకిలికి చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి నుంచి రూ.6,999 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిని అరెస్టు చేసి... పూచీకత్తుపై విడిచిపెట్టినట్లు చెప్పారు.

340 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం: మూలిగూడ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్‌ఐ షణ్ముఖరావు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు అక్రమంగా వాహనంలో సారా ట్యూబ్స్‌లో తరలిస్తున్న 340 లీటర్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఘనంగా పెదపోలమాంబ అంపకోత్సవం



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మక్కువ: శంబర పోలమాంబ జాతరలో భాగంగా పెద పోలమాంబ అమ్మ వారి అంపకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చదురు గుడి నుంచి అమ్మవారి ఘటాలను డప్పులు, వాయిద్యాలు మధ్య అర్ధరాత్రి వరకు గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఎస్.పెద్దవలస రహదారి సమీపంలోని గుడి వద్ద పెద పోలమాంబ ఘటాలను ఉంచారు. బుధవారం అక్కడే అమ్మవారికి అంపకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దీంతో శంబర జాతరకు సందడి మొదలుకానుంది. ఈనెల 8న గోముఖి నదీ తీరంలో చినపోలమాంబను కొలిచి గ్రామానికి తీసుకొస్తారు. అప్పటి నుంచి చినపోలమాంబ చదురుగుడిలో కొలువై ఉంటారు. 22, 23, 24 తేదీల్లో శంబర పోలమాంబ అమ్మవారి జాతర జరగనుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి



ఎస్.కోట రూరల్: ధర్మవరం పాఠశాలలో సావిత్రిబాయ్‌పూలే జయంతి

విజయనరం దాసన్నపేట, జనవరి 3: సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులకు స్ఫూర్తిప్రదాత అయిన పూలే సేవలను కొనియాడారు. విజయనగరంలో గుంటూరు విద్యా సంస్థల కళాశాల ప్రాంగణంలో పూలే జయంతిని నిర్వహించారు. డైరెక్టర్ బీపీ రావు, సీఐ మంగవేణి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉమామహే శ్వరరావు, పైడిరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● కలెక్టరేట్ సమీపంలోని సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ నాయకులు గంటా వీర్రాజు, పాండ్రంకి రమణలు నివాళి అర్పించారు. ● జేవీవీ సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల ఆధ్వర్యంలో కస్పా హైస్కూల్‌లో పూలే జీవితంపై పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ● టీడీపీ నాయకుడు గదుల వెంకటరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని సావిత్రిబాయి విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దిమిలి పైడిరాజు, పి.శ్రీనివాసరావు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు. ● ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ముద్దాడ మధు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, మేయర్ వీవీ లక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

● **బాడంగి:** స్థానిక ఎన్ఎస్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని జరిపారు. ఆమె గొప్పతనం గురించి ప్రిన్సిపాల్ శంకరరావు తెలిపారు. అనంతరం కళాశాలలో ముగ్గురు మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

● **లక్కవరపుకోట:** జమ్మాదేవిపేట వద్ద మహాత్మ జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యువీకే.పాత్రో ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులతో సమావేశం, విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

● **రాజాం రూరల్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సావిత్రీబాయికి నివాళి అర్పించారు. పెనుబాక ప్రభుత్వ పాఠశాలలో టీచర్లు శ్రీలక్ష్మి, కామేశ్వరమ్మలను సన్మానించారు.

● **కొత్తవలస:** స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సావిత్రీబాయి విగ్రహానికి రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కంటకాపల్లి జడ్పీ హైస్కూల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా, డీటీ రమేష్, కంటకాపల్లి హెచ్‌ఎం వి.అరుణ్‌కుమార్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు దంతులూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **వేపాడ:** బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందర్నీ అలరించారు.

● **శృంగవరపుకోట రూరల్ :** ధర్మవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు.

● **సాలూరు రూరల్:** శివరాంపురం పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆలమూరి ఉమామహేశ్వరరావు సావిత్రిబాయి జయంతిని జరిపారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **బొబ్బిలి:** స్థానిక సంఘవీధిలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ పోరాటసమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ● స్థానిక ఇందిరమ్మకాలనీలో సావిత్రీ బాయి విగ్రహానికి నివాళి అర్పించారు. సామాజిక కార్యకర్త ఆర్.జగదీశ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంఈవో గొట్టాపు వాసు తదితరులు పాల్గొన్నారు. ● కోమటిపల్లి , నారసింహునిపేట హైస్కూళ్లలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

● **పాలకొండ:** పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు , వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, తెలుగు, కామర్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఓరి ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఇన్‌చార్జి హెచ్‌ఎం గోగుల సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ దానేటి పుష్పలతను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: పూలే వేషధారణలో విద్యార్థులు

ఇంట్లోకి జింక



సీతానగరం: పెదబోగిల హడ్కో కాలనీలో నివాసముంటున్న సాకేటి లక్ష్మి ఇంటిలోకి బుధవారం ఉదయం ఓ జింక ప్రవేశించింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కొద్దిసేపు ఏం చేయాలో వారి తెలియలేదు. చివరకు జింక కాలుకు స్వల్ప గాయమైనట్లు గుర్తించి దానిని ఇంటిలోనే ఉంచారు. పార్వతీపురం అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఇంతలో జింకను చూసేందుకు స్థానికులు అక్కడకు ఎగబడ్డారు. అనంతరం ఫారెస్టు అధికారులు చేరుకుని జింకను పరిశీలించారు. చికిత్స కోసం దానిని పార్వతీపురం తరలించారు. గ్రామ సమీపంలో కొండ ప్రాంతం నుంచి జింక గ్రామంలోకి వచ్చినట్లుగా స్థానికులు భావిస్తున్నారు

పంట పొలాల్లో ఏనుగులు



కొమరాడ: గజరాజుల గుంపు పంట పొలాల్లో సంచరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం కుమ్మరిగుంట గ్రామ సమీపంలోని వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు స్పందించి ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

● తక్షణమే సమస్యలు పరిష్కరించాలి
● 23వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరారు. బుధవారానికి అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన శిబిరాల్లో నిరసన తెలిపారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు.



రాజాం రూరల్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



రామభద్రపురంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పల్లవికి పతకాలు

నెల్లిమర్ల: అరుణాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన శనపతి పల్లవి 64 కిలోల సీనియర్స్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు కోచ్ చల్లా రాము చెప్పారు. అంతర రాష్ట్ర పోటీల్లో రజత పతకం సాధించిందని తెలిపారు. పల్లవిని చల్లా రాముతో పాటు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లాన లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షురాలు ఎంలక్ష్మి, కార్యదర్శి ధింసాబాబు, బడేటి వెంకటరామయ్య అభినందించారు. ●అరుణాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన విసినిగిరి రాము 89 కిలోల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడని కోచ్ చల్లా రాము చెప్పారు. రాము స్నాచ్‌లో 121 కిలోల బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 161 కిలోలు బరువు మొత్తం 281 కిలోలు ఎత్తి ఈ పతకం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా రామును కోచ్ చల్లా రాముతో పాటు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లాన లక్ష్మీనారాయణ, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, కార్యదర్శి ధింసాబాబు,బడేటి వెంకటరామయ్య అభినందించారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు పలువురు నివాళులర్పించారు. ఎంఆర్‌సీలో పీఆర్టీయూ మహిళా ఉపాధ్యాయులు ఆల్తి వెంకటమ్మ, ఎంపీ భారతి, జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, జనవిజ్ఞాన వేదిక నాయకులు వి.మోహనరావు, సీఆర్పీ కంది రామకృష్ణ, గోపి, ఎం.శ్రీరాములు, కె.రామకృష్ణ, లెంక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. రామలింగపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, హెచ్‌ఎం గొర్లె పద్మ పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాగా జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు సావిత్రి బాయిపూలేకు నివాళులర్పించారు.

ధాన్యం సేకరణలో సమస్యలను పరిష్కరించాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీ రామారావు

గంట్యాడ, జనవరి 3: ధాన్యం సేకరణలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావును కోరారు. బుధవారం తామరాపల్లి గ్రామంలోని వరి కుప్పలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. రైతులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ఒకేమిల్లుకు ట్రక్ షీటు జనరేట్ కావడంతో ఎక్కువ సమయం అక్కడే ఉండాల్సి వస్తోందని రైతులు ఆయనకు వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు. ఆయనతో పాటు ఏవో శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకం నాగమాధవి

భోగాపురం: చినకవులవాడ గ్రామంలో వైసీపీ నుంచి జనసేన పార్టీలో పలువురు చేరినట్లు నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం నాగమాధవి బుధవారం తెలిపారు. వైసీపీ దౌర్జన్యాలు, దుర్మార్గపు పాలనపై విరక్తి తో ప్రజలు జనసేన పార్టీలో చేరుతున్నారన్నారు. చినకవులవాడకు చెందిన వైసీపీ నాయకులు కొండపు రమణ తమ అనుచరులతో పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరడానికి అనేక మంది నాయకులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

సిమెంట్ లెక్కలపై గుబులు

● స్టాక్ ఏమైందోనని ఆరా ● సరఫరాలో తేడాలు సరిచేస్తాం: ఎంపీడీవో

రేగిడి: వివిధ సచివాలయ భవనాలకు మూడేళ్ల క్రితం సరఫరా చేసిన సిమెంట్ బస్తాల లెక్కలపై సిబ్బంది, నేతల్లో గుబులు రేగుతోంది. మొత్తం 25 సచివాలయాలకు సరఫరా అయిన 52,210 బస్తాలలో ఏ సచివాలయానికి ఎన్ని సరఫరా చేశారనే దానిపై యంత్రాంగం లెక్కలు వేసే పనిలో బిజీగా ఉంది. 'ఆ సిమెంట్ సంగతేంటో' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో లెక్క తప్పిన భాగోతాన్ని వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ కథనం నేతలు, సిబ్బందిలో ప్రకంపనలు పుట్టించింది. వీటి లెక్కలు వేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మరోవైపు పంచాయితీరాజ్ డీఈఈ జైప్రకాశ్ సైతం ఈ వ్యవహారంపై స్పందించి రేగిడి పీఆర్ ఏఈ రామకృష్ణను రాజాం పిలిపించుకొని ఆరా తీసినట్లు సమాచారం. పేరు చెప్పేందుకు ఇష్టపడని మండల స్థాయి నేతలు సైతం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌చేసి కొన్ని సచివాలయాలకు రావాల్సిన సిమెంట్ వేరే సచివాలయాలకు సర్దుబాటు చేసి... లెక్కలు తేల్చటం లేదని సంబంధిత శాఖపై మండిపడుతున్నారు. దీని వల్ల చాలా నష్టపోయినట్టు వాపోయారు. ఈ వ్యవహారంలో కస్టోడియన్‌లుగా ఉన్న పంచాయితీ రాజ్, సచివాలయ సిబ్బంది ఎక్కడ తాము ఇరుక్కుంటామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తేడాలు సరిచేస్తాం

తాను మండలానికి రాకముందు సిమెంట్ సరఫరా అయినట్టు ఎంపీడీవో శ్యామలా కుమారి తెలిపారు. అప్పట్లో తేడాలు వచ్చినట్లు తనకు సమాచారం ఉందన్నారు. పూర్తి వివరాలు ఏఈ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటీవల మండల సమావేశంలో చర్చకు రాగా.. తేడాలు సరిచేయాలని పీఆర్ ఏఈని ఆదేశించినట్లు చెప్పారు. దీనిపై ఇప్పటికే మండల పరిషత్ ప్రత్యేకాధికారి, ఎంఎల్‌సీ విక్రాంత్ నివేదిక కోరారని... మరి కొద్ది రోజుల్లో తేడాలు సరిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. కొంతమంది ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు వచ్చిన సిమెంట్ వాడుకొని, సచివాలయ భవనాలకు సిమెంట్ సరఫరా కాలేదని చెబుతున్నారని... దీనిపై పూర్తి లెక్కలు సేకరిస్తున్నామని తెలిపారు.

దుర్గమ్మగుడిలో చండీహోమం

కొత్తవలస: మండలంలోని రామలింగపురం, ముసిరాం, దేవాడ గ్రామాలకు సంబంధించిన మామిడితోటలో వెలసిన దుర్గమ్మ ఆలయ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా 108 పుట్టల నుంచి సేకరించిన పుట్టమట్టితో హోమ గుండాన్ని తయారు చేసి చండీహోమాన్ని బుధవారం తెల్లవారుజాము నుంచి నిర్వహించారు. 108 కిలోల పసుపుకొమ్ములు, 108 కిలోల కుంకుమతో హోమాన్ని నిర్వహించారు. గత 17 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 7 వతేదీ వరకు జరుగుతాయి.

బిల్లుల చెల్లింపులో జాప్యం వద్దు

రేగిడి: ఉపాధికి సంబంధించి హౌసింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం ఉండకూడదని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ఎస్.హరనాథ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఓ, ఈసీ రామినాయుడు ఉపాధి ప్రగతి, వేతన చెల్లింపులు, తదితర అంశాలపై చర్చించారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు

● పోలింగ్ కేంద్రాల పరిశీలన వేగవంతం

(విజయనగరం రూరల్/విజయనగరం రింగురోడ్డు)

సార్వత్రిక ఎన్నికలకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక్కొక్క పనిపూర్తి చేసుకుని వెళుతున్న అధికారులు.. తాజాగా విజయనగరం నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. నగర పరిధిలో నగర పాలక సంస్థ అధికారులు, మండలానికి వచ్చేసరికి తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సరఫరా, పోలింగు కేంద్రం శ్లాబ్ పరిస్థితి, ఫర్నీచర్ సౌకర్యం, పోలింగు కేంద్రానికి 200 మీటర్లు ఎంత వరకూ వస్తుందనేది పరిశీలిస్తున్నారు. ఆ ప్రాంతంలో షాపులు, ఇతరత్రా పరిస్థితులు, విభిన్న ప్రతిభావంతులకు ర్యాంప్ సౌకర్యం, తాగునీటి సరఫరా, పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది? ఆ ప్రాంత చిరునామా ఇలా 19 అంశాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 240 పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమం ఈ నెల 9లోగా పూర్తి చేసి, కలెక్టర్ నాగలక్ష్మికి నివేదించాలి. అక్కడి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.



విజయనగరంలోని సాకేటి వీధి స్కూల్స్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేయాలి

దత్తిరాజేరు: ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు డి మాండ్‌చేశారు. బుధవారం పోరలిలో విలేకరులతో మాట్లాడుతూ ఈచట్టం వల్ల సామాన్యులు న్యాయానికి దూరం అవుతారన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాల గుర్తింపు

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మకాలనీలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన అవినీతి భాగోతంపై అధికారులు ఎట్టకేలకు గుట్టు విప్పారు. ఈకాలనీలో ఖాళీ స్థలాల కబ్జాలపర్వం, లక్షలాది రూపాయలకు అక్రమ విక్రయాలు జరగడం, తదితర ఆరోపణలపై ప్రజాసంఘాలు ధర్నాలు, ఆందోళనలు చేయడం, పత్రికల్లో కథనాలు రావడం తెలిసిందే. దీంతో అధికార యంత్రాంగంలో మరింత కదలిక వచ్చింది. తహసీల్దారు డోల రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనరు సత్తారు శ్రీనివాసరావు విచారణ జరిపి నివేదికను సిద్ధం చేశారు. ఈ కాలనీలో 2459 ఇళ్లస్థలాలను ఏర్పాటు చేసి లేఅవుట్‌ను ఏర్పాటు చేసినట్లు, వీటిలో 1428 మంది ఇళ్లు నిర్మించుకోగా, 479 ఇళ్లు బేస్‌మెంట్లలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు.

ఓటు నమోదు చేయించుకోండి

వేపాడ: అర్హులైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కె.ప్రసన్నకుమార్ తెలిపారు. వల్లంపూడి పోలింగ్ కేంద్రాన్ని ఆయన బుధవారం జడ్పీటీసీ సభ్యుడు శానాపతి అప్పలనాయుడుతో పాటు సందర్శించారు.

వేలం పాట వాయిదా

చీపురుపల్లి, జనవరి 3: శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం జరగవలసిన కొబ్బరి ముక్కలు, అమ్మవారి చీరల వేలం పాట వాయిదా వేసినట్టు ఈఓ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సముచితమైన ధరలకు వేలం పాటదారులు హాజరు కానందున వాయిదా వేశామన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

యువత సేవలు అభినందనీయం

భోగాపురం, జనవరి 3: యువత సేవలు అభినందనీయమని ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి అన్నారు. భోగాపురం జాతీయ రహదారి నుంచి మెయిన్ రోడ్‌కు వెళ్లే రోడ్డులో బట్టి కాలువ అంచులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ స్థానిక యువత ఆర్థిక సాయంతో బుధవారం ఎస్ఐ స్టాపర్లు ఏర్పాటు చేశారు. వీటి విలువ సుమారు రూ.36 వేలు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మంచిగా నడుచుకొంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. స్టాపర్లు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేసిన వారిలో బొల్లు త్రినాథ్ మాత నవీన్, కొమ్మూరు నిఖిల్, పల్లంట్ల జగదీష్, బొడ్డ వెంకటేష్, ఆకిరి సునీల్, కాపుగంటి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బహుమతుల ప్రదానం

భోగాపురం, జనవరి 3: భోగాపురం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి జనసేన నెల్లిమర్ల ఇన్‌చార్జి లోకం నాగమాధవి నగదు బహుమతులు అందజేసినట్లు క్రీడల నిర్వాహకుడు పల్లంట్ల జగదీష్ బుధవారం తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు బి.త్రినాథ్, ఎం.నవీన్, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భోగాపురం, జనవరి 3: సవరవల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మస్తాన్‌వల్లి బుధవారం తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సవరవల్లి, రావాడ, కవులవాడ, తూడెం, ఎ.రాయవలస, గూడెపువలస, దల్లిపేట, భైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, పరిసర గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు.

20 మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం, జనవరి 3: భోగాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో మద్యం విక్రయిస్తున్న నక్కా పైడిరాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. పంచాయతీ సమీప పాన్‌షాపులో నక్కా పైడిరాజు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అతని నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇలా ఉండగా... గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు.